# సాక్షి శ్రీకాకుళం

శనివారం । 12 । జూలై । 2025






## గండం గడిచింది

కొయ్యాం తీరానికి సమీపంలో బోటు బోల్తా పడింది. అంతా క్షేమంగా తీరానికి చేరారు.

- 8లో



## గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలు

ఆమదాలవలస మున్సిపాలిటీలోని ఓ ఇంటిలో గ్యాస్ లీకైంది. ఇద్దరు గాయపడ్డారు.

- 8లో

## మిగులు సీట్ల భర్తీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అన్ని తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కో ఆర్డినేటర్ జి.గ్రేస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి చేరేందుకు 9వ తరగతి ఫైనల్ మార్కు షీటు, ఇంటర్ సెకండియర్ చేరేందుకు ఫస్ట్ ఇయర్‌లో 50శాతం మార్కులతో పాసై ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701736862 లేదా 9000314209లకు సంప్రదించాలని కోరారు.

## న్యూస్‌రీల్

### హత్యా రాజకీయాలు సరికాదు

- టీడీపీ వైఖరిని అందరూ ఖండించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: కూటమి పాలనలో హత్యా రాజకీయాలు శ్రీకాకుళానికి చేరాయని, ఇది మంచి సంప్రదాయం కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఫరీదుపేటలో వైఎస్సార్ సీపీ క్రియాశీల కార్యకర్తగా, నాయకునిగా గుర్తింపు పొందిన సత్తారు గోపిని దారి కాచి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివాదాలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలే తప్ప ఇలా హత్యలు చేయడం సరికాదన్నారు. గోపి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. ఈ హత్య కేసును పోలీసులు పక్షపాతం లేకుండా దర్యాప్తు చేయాలని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

### కుంగ్‌ఫు శేఖర్ అరెస్టు.. బెయిల్

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగరానికి చెందిన రౌడీ షీటర్ పైలా చంద్రశేఖర్ అలియాస్ కుంగ్ ఫు శేఖర్‌ను శ్రీకాకుళం రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గడిచిన నెలలో జరిగిన ఓ కేసు విషయంలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రాము తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు.. రాగోలు జెమ్స్‌లో పనిచేస్తున్న ఇద్దరి ప్రేమ వ్యవహారం వివాదాస్పదం కావడంతో ఆ కేసు జూన్‌లో శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఈ కేసు విచారణ జరుగుతుండగా పెదపాడుకు చెందిన బొట్టా శేఖర్ ఈ కేసును వేరే వ్యక్తి ద్వారా పరిష్కరిస్తామని చెప్పి కుంగ్ ఫు శేఖర్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సెటిల్మెంట్‌లో యువకుడి కుటుంబ సభ్యుల వద్ద కుంగ్ ఫు శేఖర్ రూ.లక్ష 50వేలు తీసుకున్నారు. మధ్యవర్తిగా ఉన్నందుకు శేఖర్ కూడా రూ.20వేలు తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కానీ ప్రేమ వ్యవహారంలో యువకుడిని రిమాండ్‌కు తరలించారు. దీంతో యువకుడి తండ్రి కుంగ్ ఫు శేఖర్, బొట్టా శేఖర్‌లపై వారం కిందట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు వీరిద్దరూ కలిసి బాధితులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు డిమాండ్ చేశారని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శుక్రవారం వీరికి కండీషనల్ బెయిల్ మంజూరైందని ఎస్ఐ తెలిపారు.

### భారత వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత వాయుసేనలో ఉద్యోగాల కోసం రాష్ట్ర యువతకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక్కసారి కాకుండా రెండు విభాగాల్లో ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఎయిర్‌మెన్ (మెడికల్ అసిస్టెంట్), అగ్నిపథ్ స్కీమ్ కింద 'అగ్నివీర్ వాయు (కాంబటెంట్)' కేటగిరీలో నాలుగేళ్ల పాటు సేవా అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగాల కోసం ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జూలై 11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి జూలై 31వ తేదీ రాత్రి 11 గంటల వరకు ఉంటుందని తెలిపారు. హెచ్‌టిటిపిఎస్://ఎయిర్‌మెన్‌సెలక్షన్.సిడిఏసి.ఇన్ లేదా హెచ్‌టిటిపి://అగ్నిపత్వాయు.సిడిఏసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రొవిజనల్ అడ్మిట్ కార్డులు జారీ చేస్తారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించేందుకు వీలుగా సంబంధిత వివరాలను ప్రత్యేకంగా అందించామని కలెక్టర్ తెలిపారు.

### సీహెచ్‌సీలో కుక్కల బెడద

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోకి శునకాలు ప్రవేశిస్తున్నాయి. అన్ని వార్డుల్లోనూ కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో రోగులు భయపడుతున్నారు. ప్రసూతి విభాగం, మేల్, ఫీమేల్ వార్డులతో పాటు అత్యవసర విభాగాలు సైతం ఉన్నాయి. అలాంటి ప్రాంతంలో రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం కుక్కలు గుంపులుగా తిరుగుతుండటంతో భయాందోళనకు గురవుతున్నారు.



పలాస సీహెచ్‌సీలో రాత్రి వేళ కుక్కల స్వైర విహారం



రాజకీయం అరాచకీయంగా మారుతోంది. దాడులు, దౌర్జన్యాలకు అధికారం ఓ అర్హతగా మారిపోయింది. పచ్చటి పల్లె కంట రక్తం కారేలా కూటమి పాలన సాగుతోంది. ఏడాది వ్యవధిలోనే ఫరీదుపేటలో రెండో హత్య జరిగింది. దారి కాసి దాడి చేసి ఓ మనిషి చంపేంత మూర్ఖత్వానికి కారణమెవరు అంటే.. అన్ని వేళ్లు అధికార పక్ష నేతలనే చూపిస్తున్నాయి. ఎక్కడో టీవీల్లో, పేపర్లలో చదివి అయ్యో అనుకునే ఈ రాజకీయ హత్యల విష సంస్కృతిని టీడీపీ జిల్లా వరకు తీసుకువచ్చింది. ఫలితంగా పల్లె మట్టిలో తెగిన తాళిబొట్లు వెక్కిరిస్తున్నాయి.

# పచ్చమూకల పాతకం

## సిక్కోలులో హత్యా రాజకీయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్ (ఇన్‌సెట్లో) గోపి మృతదేహం

- ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో వరుస హత్యలు
- తాజాగా వైఎస్సార్‌సీపీ నాయకుడిని చంపిన టీడీపీ మూకలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రాణాలు తీస్తున్న పచ్చ గూండాలు
- హత్యలు, హత్యాయత్నాలతో రెచ్చిపోతున్న పరిస్థితి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాల సంస్కృతిని శ్రీకాకుళానికి తీసుకువచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో రాజకీయ హత్యలు, హత్యాయత్నాలు పెరిగిపోయాయి. ఈ వైఖరి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తోంది. పట్ట పగలు, నడిరోడ్డుపై ప్రత్యర్థుల్ని పచ్చ మూకలు హతమారుస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఒకే ఊరిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు నాయకులు హత్యకు గురయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**ఫరీదుపేటలో భయానక పరిస్థితులు..**

ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో భయానక వాతావరణం నెలకొంది. అధికార పార్టీ వాళ్లు తప్ప ప్రతిపక్ష నాయకులు ఉండకూడదన్న ధోరణితో పచ్చ మూకలు వ్యవహరిస్తున్నాయి. ఎప్పుడు ఎవర్ని హతమారుస్తారో తెలియని పరిస్థితి చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారం ముసుగులో ఉన్న రౌడీ మూకలు చెలరేగిపోతున్నాయి. చంపడానికి లైసెన్సు ఇచ్చినట్టుగా రెచ్చిపోతున్నాయి. దీంతో స్థానికంగా ఉండటానికే అక్కడి ప్రజలు భయపడుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గత ఏడాది ఆగస్టు 18న కూన ప్రసాద్ అనే



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

వైఎస్సార్‌సీపీ కార్యకర్త పల్సర్ బైక్‌పై బహిర్భూమికి వెళ్తుండగా 10 మంది ఒక్కసారిగా బైక్ ఆపి, తాళం తీసుకుని కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్ పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి మరీ కొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కూన ప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఆ ఘటన జరిగి ఏడాది కాకముందే అదే గ్రామంలో ఉప సర్పంచ్ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తారు గోపిపై శుక్రవారం దారి కాచి దాడి చేశారు. కత్తులు, కర్రలతో దాడి చేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఒక్కసారిగా దాడి చేయడమే కాకుండా పడిపోయిన తర్వాత వేరొక ప్రాంతానికి తీసుకెళ్లి ఏకంగా హత్య చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. గతంలో టీడీపీ మూకల చేతిలో హత్యకు గురైన కూన ప్రసాద్, తాజాగా హత్యకు గురైన సత్తారు గోపి సన్నిహితులే. తాజాగా మృతి చెందిన సత్తారు గోపి దగ్గర గతంలో హత్యకు గురైన కూన ప్రసాద్ డ్రైవర్‌గా పనిచేసేవారు. ఆ ఇద్దరూ రాజకీయంగా అడ్డొస్తున్నారని చంపేశారు. రాజకీయ కక్షలతో ప్రాణాల్ని బలితీసుకుంటున్నారు.



భారీ భద్రత మధ్య మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

### ఏడాదిగా ఇదే పరిస్థితి

- మంత్రి అచ్చెన్న సొంత పంచాయతీ నిమ్మాడలోని వెంకటాపురం గ్రామ అమ్మవారి ఉత్సవాల్లో టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ తోట మల్లేషు అనే వ్యక్తి మరణించాడు. మల్లేషు కుమారుడు గడిచిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఏజెంటుగా పనిచేశాడనే కక్షతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం కాకముందే పక్కా ప్రణాళికతో టీడీపీ కార్యకర్తలు ఈ దారుణానికి ఒడిగట్టారు.
- పలాస మండలం లక్ష్మీపురం ఎంపీటీసీ గుండు మోహనరావుపై జూన్ 7న రాత్రి పొలం వద్ద కాపు కాసి ఇనుపరాడ్లతో టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. అడ్డుపడిన మోహనరావు మేనల్లుడు, భార్యపైనా దాడి చేశారు.
- శ్రీకాకుళం మండలం భైరివానిపేటకు చెందిన శిమ్మ అప్పన్న, బగ్గు రామారావుపై జూన్7న రాత్రి టీడీపీ కార్యకర్తలు రాజకీయ కక్షలతో కర్రలతో దాడులు చేశారు.
- 2024 అక్టోబరు 16న జిల్లా నడిబొడ్డున బలగ మెట్టు వద్ద వందల మంది జనాలు చూస్తుండగా సనపల సురేష్ అనే వ్యక్తిపై ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులు దాడి చేశారు.
- 2024 అక్టోబరు 27న కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో దళిత దంపతులైన చల్ల అప్పలరాజు, దమయంతిలపై టీడీపీ గూండాలు ధర్మాన శ్రీను, ధర్మాన ప్రసాద్, తంగి షణ్ముఖ, పల్లి వైకుంఠరావు, పగోటి సీమలు, పగోటి అప్పారావు, మరో 70 మంది ఇంటికొచ్చి మరీ దాడికి పాల్పడ్డారు.
- 2024 అక్టోబరు 27న ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన మాజీమంత్రి సీదిరి అప్పలరాజు అనుచరులు అల్లు రమణ, మన్మథలపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లోనే టీడీపీ నాయకులు దాడి చేశారు. పిడిగుద్దులు గుద్ది, షర్టులు చింపేసి రౌడీల్లా వీరంగం సృష్టించారు.



గత ఏడాది టీడీపీ వర్గీయుల దాడిలో మృతి చెందిన ప్రసాద్

- 2024 అక్టోబర్ 28న వజ్రపుకొత్తూరు మండలంలోని డోకుల పాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ నాయకులు దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన వైఎస్సార్‌సీపీ నాయకుడిని ఆస్పత్రికి వెళ్లనివ్వకుండా నిర్బంధించారు.
- 2024 నవంబరు 16న వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీకి చెందిన కదిరి నీలమ్మ, రట్టి లక్ష్మమ్మ, గూడెం చిన్నారావులపై దాడి చేశారు. గ్రామ కమిటీ ఖర్చుకు సంబంధించి లెక్కలు అడిగారని అక్కసుతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ గొల్లు చిన్నారావు, మరికొంతమంది దాడికి పాల్పడ్డారు.
- 2025 జనవరిలో సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త సిర్లాపు నరేష్ ఇంటికి వెళ్లి టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. కత్తులతో, చెక్కలతో దాడి చేశారు.
- 2025 మార్చి 23న ఇచ్ఛాపురం మండలం మఖరాపురం గ్రామంలో ఒక్కగానొక్క విశ్వబ్రాహ్మణ కుటుంబం వైఎస్సార్సీపీకి మద్దతుగా ఉండటంతో ఆ కుటుంబంలోని వ్యక్తిపై టీడీపీ సానుభూతిపరులు దాడి చేశారు.
- జిల్లాలో ఎన్నడూ లేని విధంగా శాంతిభద్రతలు అదుపు తప్పాయి. గంజాయి బ్యాచుల దాడులతో జనాలు బెంబేలెత్తిపోతున్నాయి. రౌడీషీటర్ల దౌర్జన్యాలు, బెదిరింపులతో చాలా మంది జిల్లాను వదిలి వెళ్లిపోతున్నారు. భూకబ్జాలు, భూతగాదాలు, ఆర్థిక సెటిల్‌మెంట్లు పేరుతో పచ్చమూకలు రెచ్చిపోతున్నాయి. ఏడాది కాలంలో జిల్లాలో 22 హత్యలు జరిగాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

### అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆధార్ కార్డులు లేని ఎనిమిది మంది అనాథ పిల్లలను గుర్తించామని, వారికి వెంటనే ఆధార్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు వెల్లడించారు. ఈ మేరకు ఆయన స్థానిక అధికారులతో ఒక సమావేశం నిర్వహించి, వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, ఆధార్ లేని నిరాశ్రయులైన పిల్లల కోసం జిల్లాలో ఒక ప్రత్యేక సర్వే చేపట్టారు. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల వారికి విద్య, వైద్యం, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని హరిబాబు పేర్కొన్నారు.

### బడి కోసం రోడ్డెక్కిన కృష్ణాపురం

పురపాలక సంఘం పరిధిలోని రెండో వార్డు కృష్ణాపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న మున్సిపల్ ప్రైమరీ పాఠశాలను తరలించవద్దంటూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు శుక్రవారం రోడ్డెక్కారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు నిరసన తెలుపుతూ ప్రైమరీ పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేయవద్దంటూ అధికారులను వేడుకున్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పాఠశాలను తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ విద్యా సంవత్సరానికి మున్సిపల్ ప్రైమరీ పాఠశాల గానే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



కృష్ణాపురంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

– ఆమదాలవలస

### 600 ఎకరాల వరి.. నీరు లేక తడారి



ఎండిపోతున్న పొలాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పచ్చటి పొలాలు కళ్ల ముందే తడారి ఎడారిలా మారిపోతున్నాయి. వంశధార అధికారుల నిర్వాకంతో దాదాపు 600 ఎకరాల పొలాలకు నీరు అందడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొండవలస గ్రామంలో సైలాడ చెరువు ఆయకట్టు కింద సుమారు 600 ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం, గార మండలాల రాజకీయ నేతల నుంచి అధికారులకు ఒత్తిళ్లు రావడంతో వంశధార కుడి కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేశారు. కానీ విడుదల చేసిన కొద్ది గంటల్లోనే నీరు నిలిపివేశారు. పూడిక తీత పనులు పూర్తి కాకపోవడంతో ఆపేశామని చెబుతున్నారు. దీంతో రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వారంతా ఎండి పోతున్న తమ పొలాల వద్ద నిరసనలు తెలిపారు. ఈ సమయంలో సాగునీటిని అందించకపోతే తమ పొలాలు ఎందుకూ పనికిరావని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

– నరుబుజ్జిలి

# గండం గడిచింది!

- నడిసంద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు
- బోటులో నీరు చేరడంతో దిక్కుతోచని పరిస్థితి
- మెరైన్, పోలీసులకు తెలియజేసినా కానరాని స్పందన
- మరో బోటు రావడంతో సురక్షితంగా ఒడ్డుకు..


సురక్షితంగా బయటపడిన మత్స్యకారులు

**ఎచ్చెర్ల:** నడిసంద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు ప్రాణభయంతో విలవిల్లాడిపోయారు. సాయం కోసం మెరైన్, పోలీసులను ఆశ్రయించినా స్పందన లేకపోవడంతో ప్రాణాలపై ఆశలు వదులుకున్నారు. ఈ సమయంలో మరో బోటు రావడంతో సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటన ఎచ్చెర్ల మండలం కొయ్యాం సముద్ర తీరానికి సుమారు 45 మైళ్ల దూరంలో చోటుచేసుకుంది. బాధిత మత్స్యకారులు, బోటు యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లాకు చెందిన పది మంది మత్స్యకారులు ఈ నెల 9న ఉదయం 5 గంటలకు సముద్రంలో వేటకోసం బయల్దేరారు. ఎచ్చెర్ల మండలంకొయ్యాంకు 45 మైళ్ల దూరంలో ఉండగా బోటు చెక్క పక్కకు ఒరిగిపోవడంతో లోపలికి నీరు ప్రవేశించింది. కొద్దికొద్దిగా బోటు మునిగిపోయే సూచనలు కనిపించాయి. దీంతో బోటులో ఉన్న వారు వారి యాజమాని వాసపల్లి ధనారాజ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన మెరైన్ సిబ్బంది, పోలీసులకు, వేరే బోటు నిర్వాహకులకు ఫోన్‌లు చేసినా ఫలితం లేకపోయింది. ఆ సమయంలో మరో బోటు రావడంతో వారిని సాయం అడిగారు. వారు తొలుత సహకరించకపోవడంతో వలకు అడ్డుగా బోటును నిలబెట్టడంతో సాయం చేసేందుకు అంగీకరించారు. పది మంది మత్స్యకారులు ఆ బోటులోకి వెళ్లిపోయారు. 10వ తేదీ మొత్తం ఆ బోటు లోనే గడిపారు. 11వ తేదీ ఉదయం కొయ్యాం తీరానికి చేరుకున్నారు. అప్పటికే యజమాని వచ్చి ఆటోలో మత్స్యకారులను విశాఖకు తీసుకెళ్లిపోయారు. ఈ ఘటనలో సుమారు 90 లక్షల విలువైన బోటు మునిగిపోయిందని యజమాని తెలిపారు.

**చనిపోతే వస్తామన్నారు..**
అంతకుముందు బోటు యాజమాని వాసపల్లి ధనరాజ్ మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు సాయం అందించాలని మెరైన్ సిబ్బందికి తెలియజేశాం. ఎవరూ స్పందించలేదు. అనంతరం ఎచ్చెర్ల పోలీసులకు ఫోన్ చేస్తే ఎవరైనా చనిపోతే అప్పుడు వస్తామని బదులిచ్చారని, సముద్రంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోకపోవడం అన్యాయమని అన్నారు.

## బదిలీ టీచర్లకు జీతాలు ఎప్పుడిస్తారు?

**శ్రీకాకుళం:** జూన్‌లో జరిగిన రీ ఎపోర్షన్, ప్రమోషన్లు, బదిలీ కౌన్సిలింగ్ కారణంగా కొత్త పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులలో కొందరికీ ప్రభుత్వ ఆమోదం పొందని కారణంగా జూన్ జీతాలు చెల్లించలేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ శుక్రవారం డిమాండ్ చేశారు. జీతాలు వేయకపోవడంతో మినహాయింపులు, బ్యాంకులకు చెల్లించాల్సిన ప్రీమియంలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన క్యాడర్ స్ట్రెంత్‌ను ఆమోదించి జీతాలు చెల్లించాలని కోరారు. విద్యా రంగంలో అనవసర ప్రయోగాలు, బోధనేతర కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వకుండా విద్యాబోధనపై దృష్టి పెట్టేలా కృషి చేయాలన్నారు.

## ● ప్రజల్లోకి కూటమి వైఫల్యాలు



కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి సంబంధించి పోలాకి రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం నరసన్నపేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు, మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట

# ఆదిత్యాలయంలో విజిలెన్స్ విచారణ


ఆలయంలో జగన్మోహనరావు సమక్షంలో వాంగ్మూలాలను రికార్డు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రూ.లక్షల్లో అక్రమాలు చేసినట్లుగా అందిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం విజిలెన్స్ సిబ్బంది విచారణ చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురి నుంచి వాంగ్మూలాలను స్వీకరించారు. దాదాపుగా రూ.2 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు సమాచారం. భక్తుల దర్శనాల ఏర్పాట్లు, సాకర్యాలు, ఆలయంలో వివిధ రకాల అభివృద్ధి పనుల పేరిట రూ.లక్షల్లో అక్రమంగా చెక్కులను జారీ చేస్తూ.. ఆలయ నిధులను దారుణంగా తినేశారని విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

**రెగ్యులర్ ఉద్యోగులే టార్గెట్‌గా..**
విశాఖపట్నంలో గ్రేడ్-2 ఈవోగా రిటైర్డ్ అయిన జగన్మోహనరావుతో పాటు ఆలయ రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ కావ్యశ్రీల ప్రమేయంతో రెగ్యులర్ ఉద్యోగుల పేరిట అక్రమంగా చెక్కులు జారీ అయ్యాయని గుర్తించారు. ఎర్రయ్య అనే అటెండర్‌కు తెలియకుండా ఆయన పేరుతో రూ.5 లక్షల విలువైన చెక్కులు, మరో రెగ్యులర్ రికార్డు అసిస్టెంట్ శిమ్మ మల్లేశ్వరరావు పేరిట 19 చెక్కులు, అటెండర్ శ్రీనివాసరావు పేరుతో సుమారు 4 చెక్కులు, స్వీపర్ నీలయ్య పేరుతో 2 చెక్కులతో పాటు ఆలయంలో సిమ్మెంట్ పనులు చేసే మేస్త్రి కునుకు రాము అనే వ్యక్తి పేరిట ఏకంగా 9 చెక్కులు, దినసరి పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్న బుజ్జి పేరిట మరో 4 చెక్కుల వరకు జారీ చేసేశారు. ఆయా రెగ్యులర్ ఉద్యోగుల సంతకాలు కూడా ఫోర్జరీవిగా పేర్కొంటున్నారు. దీంతో పాటు ఆలయంలో విద్యుత్‌తో పాటు పలు రకాల పనులను కాంట్రాక్ట్ విధానంలో చేస్తున్న క్లాస్-1 కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు. మిగిలిన చెక్కులన్నీ ప్రైవేటు వ్యక్తులు, వ్యాపారుల పేరుతో జారీ చేశారు.

**వివాదాస్పదంగా వాంగ్మూలాల స్వీకరణ..**
విజిలెన్స్ అధికార సిబ్బంది.. తమ జిల్లా కార్యాలయంలో వాంగ్మూలాలను స్వీకరించకుండా ఆలయ కార్యాలయంలో కూర్చుని వాంగ్మూలాలను దగ్గరుండి రాయించడం వివాదాస్పదమయ్యింది. అక్రమాలు చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను ముందున కూర్చోబెట్టుకుంటే వాస్తవాలను ఎలా చెప్పగలమని కొందరు దినసరి వేతనదారులు ఆక్షేపించారు. ఇప్పటికైనా విజిలెన్స్ ఉన్నతాధికారులు తమదైన శైలిలో విచారించి ఆలయంలో అక్రమాల నిగ్గు తేల్చాలని పలువురు కోరుతున్నారు.

## గ్యాస్ లీకై ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన ఇల్లు

**ఆమదాలవలస:** పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలస పదో వార్డు వాంబే కాలనీలో గ్యాస్ లీకై ఇద్దరు గాయాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. వాంబే కాలనీకి చెందిన గుంటుకు సరస్వతి టిఫిన్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎదురు ఇంట్లో నివసిస్తున్న కోలా మాధవరావు ఘటనా స్థలానికి వెళ్లి మంటలు ఆర్పడానికి ప్రయత్నించగా ఆయన కూడా గాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.70 వేల నష్టం జరిగినట్లు సమాచారం. ఎస్సై ఎస్.బాలరాజు సైతం ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. గ్యాస్ సిబ్బంది పరిశీలించి బాధితురాలితో మాట్లాడారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## బూరగాంలో కలకలం

**టెక్కలి :** బూరగాం గ్రామంలో శుక్రవారం కలకలం రేగింది. ఓ ఇంటికి నిత్యం కొంతమంది యువతీ యువకులు వస్తూ పోతుంటారని, ఓ మహిళ చీకటి వ్యవహారం నిర్వహిస్తోందంటూ స్థానికులు ఇంటికి ఇరువైపులా తాళాలు వేసి నిర్బంధించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ కేశవరావు, సిబ్బంది గ్రామానికి చేరుకుని మహిళతో పాటు ఇంట్లో నిర్బంధించిన ముగ్గురు యువకులు, ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, గ్రామస్తులు నిర్బంధించిన వారంతా తనకు తెలిసినవారేనని ఆ మహిళ చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# పర్యాటక స్థూపంగా పైలాన్


పైలాన్ వద్ద పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

**ఇచ్ఛాపురం రూరల్:** ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన పైలాన్‌ను పర్యాటక స్థూపంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. వైఎస్ జగన్ పాదయాత్ర సందర్భంగా 2017లో లొద్దపుట్టిలో విజయ స్థూపాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం పైలాన్ శిథిలావస్థకు చేరుకోవడంతో శుక్రవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాదయాత్రకు చిహ్నంగా ఉండే పైలాన్‌ను ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త మదిలో చిరస్థాయిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కారంగి త్రినాథ్, ఆశి దాలయ్యరెడ్డి, పిలక సంతు, ఉప్పాడ రాజారెడ్డి, నైనా తేజా, తులసీ, తిప్పన ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

## ● ఇక్కడో పాక ఉండాలే..!


పాక కాలిపోవడంతో స్థలం చదును చేసిన దృశ్యం


పాకలో నడిపిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఇదే (ఫైల్)

ఈ చిత్రంలో చదును చేసిన స్థలంలో మొన్నటి వరకు పాక ఉండేది. కొత్తూరు మండలం వసప గ్రామంలో ఈ నెల 5వ తేదీ రాత్రి ఇదేచోట ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపిన శంకరరావు అనే వ్యక్తి మిన్నారావు అనే యువకుడిని హత్య చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇంతలో ఏం జరిగిందో గానీ గురువారం రాత్రి పూరిపాక కాలిపోయింది. ఆ ఆనవాళ్లు కూడా లేకుండా యంత్రాలతో చదును చేసేశారు. పోలీసు దర్యాప్తు దశలో ఉండగా పాకను ఎవరు కాల్చారు?ఎందుకు చదును చేశారనే విషయం తెలియడం లేదు. ఈ విషయమై దర్యాప్తు చేపట్టాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

- కొత్తూరు

## క్లుప్తంగా

### కాశీబుగ్గలో ఎస్పీ గ్రీవెన్స్


సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

**కాశీబుగ్గ:** కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్, చీటింగ్ తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించారు.

### శాకంబరిగా సంతోషిమాత



**శ్రీకాకుళం కల్చరల్ :** పాత శ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలోఅమ్మవారికి వివిధ కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు.

### రోడ్డు తడుస్తోంది.. ఊరి గొంతు ఎండుతోంది!


పైప్ లీకేజీ నీటిని ఒడిసి పట్టుకుంటున్న డొంకూరు మహిళ

**ఇచ్ఛాపురం రూరల్:** డొంకూరు గొంతు ఎండుతోంది. ఈ గ్రామస్తులకు అందిస్తున్న తాగునీరు రోడ్డు పాలు కావడంతో ఊరి వారు దాహం కేకలు పెడుతున్నారు. సుమారు నాలుగు వేల జనాభా ఉన్న ఈ గ్రామానికి ఉద్దానం తాగునీరు అందేది అంతంత మాత్రమే. అయితే స్థానిక వంతెన వద్ద పైప్ లీకేజీ కావడంతో మంచి నీరు వృధాగా పోతుండటంతో మహిళలు లీకేజీ నీటిని నింపుకునేందుకు ఆరాటపడుతున్నారు. నీరు లేక తమ గొంతెండుతుంటే, గత కొన్ని రోజులుగా పైప్ లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆక్రమణల తొలగింపు


కళాశాల స్థలంలో కర్రలు, కుప్పలను తొలగిస్తున్న విద్యార్థులు

**జి.సిగడాం:** జి.సిగడాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆట మైదానంలో ఎట్టకేలకు ఆక్రమణలు తొలగించారు. తహసీల్దార్ మహాదేవు సరిత కృషితో ఎస్ఐ వై.మధుసూదనరావు నేతృత్వంలో గడ్డికుప్పలు, కర్రలు, వివిధ రకాల సామగ్రిని తొలగించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భూమి తమదంటూ ఆక్రమించారు. ఈ విషయమై ఎస్ఎఫ్ఐ నాయకులు, సభ్యులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే చేసి ఆటస్థలాన్ని కళాశాలకు అప్పగించారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో తహసీల్దార్‌ను పలువురు అభినందించారు.